ప్రజాశక్తి
మంగళవారం 9 ఏప్రిల్ 2024 8 పేజీలు


కర్నూలు


నంద్యాల

ఉగాదికి ధరాఘాతం

- భగ్గుమంటున్న నిత్యావసరాల ధరలు - సామాన్యునికి పండగ పూటా భక్ష భోజనం కరువే


ఆదోనిలో కిటకిలాడుతున్న మార్కెట్

ఉగాదికి సామాన్యునికి ధరాఘాతం తప్పడం లేదు. అడ్డూ అదుపు లేకుండా పెరుగుతున్న ధరల ప్రభావంతో నిత్యావసర వస్తువులు, కూరగాయలు భగ్గుమంటున్నాయి. నెలవారీ బడ్జెట్ తలకిందులవు తోందని వేతన జీవులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యునికి పండగ పూట కూడా భక్ష భోజనం కరువైంది..

వార్త 3లో

కర్నూలు అసెంబ్లీ

సిపిఎం అభ్యర్థిగా గౌస్ దేశాయ్



ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు అసెంబ్లీ సిపిఎం అభ్యర్థిగా డి.గౌస్ దేశాయ్‌ను ప్రకటించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో సిపిఎం తరపున కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా డి.గౌస్ దేశాయ్ పోటీ చేయనున్నట్లు తెలిపారు. డి.గౌస్ దేశాయ్ కర్నూలు జిల్లా పెద్దకడబూరు మండలం, కల్లుకుంటలో మద్యతరగతి రైతు కుటుంబంలో డి. ఖాదర్ దేశాయ్, జైనబ్బీల దంపతులకు 1969 జూన్ 1 జన్మించారు. 5వ తరగతి వరకు సొంత గ్రామం కల్లుకుంటలోనే చదువుకున్నారు. 6 నుండి 10వ తరగతి వరకు పెద్దకడబూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. 10వ తరగతిలో స్కూల్ ఫస్టు వచ్చారు. 1986 నుండి 1991 వరకు ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజిలో డిగ్రి పూర్తి చేశారు. 1991-92లో మహబూబ్ నగర్‌లోని ఆల్మదీన కాలేజీలో బిఇడి పూర్తి చేశారు. 1994లో మేనత్త కూతురితో వివాహం అయింది. ఆయనకు ముగ్గరు సంతానం. (ఇర్ఫాన్, మునీర్, డాక్టర్ పర్వీన్).

ఇంటర్‌మీడియట్ చదువుతున్నపుడే 1986లో విద్యార్థి సంఘం (ఎస్ఎఫ్ఐ)లో చేరి బిఇడి పూర్తయ్యే వరకు విద్యార్థి ఉద్యమంలో పని చేశారు. 1988లోనే సిపిఎం సభ్యత్వం పొందారు. ఆదోని ఆర్ట్స్ కాలేజిలో హాస్టల్ విద్యార్థుల సమస్యలపై, అధిక ఫీజులకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలలో పాల్గొని నాయకత్వం వహించారు. 1993లోనే సొంత గ్రామంలో యువజన సంఘం పెట్టి అక్కడ సిపిఎంకు పునాదులు వేశారు. ఆ గ్రామంలో సిపిఎం సర్పంచిగా గెలిచేలా కృషి చేశారు. 1995లో కర్నూలు నగరంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శిగా, 1998 నుండి 2001 వరకు జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. 2002 నుండి సిఐటియు కర్నూలు నగర కార్యదర్శిగా, 2005 నుండి 2010 వరకు

మిగతా 3లో

వైభవంగా ప్రభోత్సవం

- స్వామి అమ్మవార్లకు నంది వాహనసేవ - మహాసరస్వతి అలంకారంలో అమ్మవారు



ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాలలో భాగంగా మూడవ రోజు సోమవారం స్వామి అమ్మవార్లకు వైభవంగా ప్రభోత్సవం, నందివాహనసేవ, అమ్మవారికి మహాసరస్వతి అలంకారం, విరాచార విన్యాసం, అగ్నిగుండ ప్రవేశం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాలలో భాగంగా ఉదయం 8 గంటలకు చండీశ్వరపూజ, మండపారాధన, కలశార్చనలు, జపానుష్ఠానములు, రుద్రహెూమం, చండీహెూమం, జపాలు,

మిగతా 3లో

16న వైఎస్ షర్మిల ప్రచార యాత్ర



ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 16న పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రచార యాత్రను కర్నూలు జిల్లాలో నిర్వహించనున్నారు. 16న నంద్యాల జిల్లాలోని బ్రాహ్మణ కొట్కూరు గ్రామం నుండి కోడుమూరు నియోజకవర్గంలోని గార్గేయపురం గ్రామంలోకి ప్రచార యాత్ర ప్రవేశిస్తుంది. అదే రోజు కర్నూలు నగరంలో రోడ్ షో నిర్వహించిన అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తారు. 17న పాణ్యం , డోన్ నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు కోడుమూరులో రోడ్‌షో నిర్వహించి వైఎస్ షర్మిల బహిరంగ సభలో పాల్గొన్నారు.

అందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు

- కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

వార్త 2లో

ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

వార్త 3లో

అందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

సాధారణ ఎన్నికలు–2024 లో వికలాంగులకు పూర్తి స్థాయిలో ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల సంఘాల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌రోజు ప్రతిఒక్కరితో పాటు విభిన్న ప్రతిభావంతులు కూడా సులభంగా వచ్చి వారి ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా విభిన్న ప్రతిభావంతులైన ఓటర్లు ఎవ్వరి సహాయం లేకుండా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా వీల్ చైర్ వెళ్లే విధంగా ర్యాంపు, తాగు నీరు, షెడ్స్ (చలువా పందిర్లు) ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా పోలింగ్ కేంద్రాలకు వచ్చే వికలాంగులకు ఓటర్లకు ఇబ్బంది లేకుండా సహాయకులుగా (వాలంటీర్ లుగా) ఇద్దరిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ వారి ఆదేశాల మేరకు కంటిచూపు లోపం ఉన్నవారికి బ్రెయిలీ లిపిలో ఏర్పాటు చేయడంతో పాటు ట్రాన్స్ జెండర్స్ ఓటర్స్ పట్ల కూడా ఎటువంటి వివక్షత చూపకుండా వారు కూడా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా 85 ఏళ్ల ముఖ్యంగా అనారోగ్య కారణాల వల్ల ఇంటి నుంచి బయటకు రాలేని వారి కోసం మాత్రమే హోమ్ ఓటింగ్ కల్పిస్తామన్నారు. అందుకు గాను ఇంటింటి సర్వే నిర్వహించి వారు రాలేని పక్షంలో మాత్రమే వారి నుంచి సమ్మతి, రిటర్నింగ్ అధికారి అనుమతి మేరకు వారికి ఇంటి వద్దనే ఓటు హక్కు కల్పిస్తామన్నారు. సమావేశంలో డిఆర్ఒ మధుసూదన్‌రావు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సహకారాలు రెయిస్ ఫాతిమా, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, ప్రణాళిక శాఖ సహాయ సంచాలకులు భారతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్నలక్ష్మి, డిఎంహెచ్ఒ ప్రవీణ్ కుమార్, ఎస్ఎస్ఎ పిఒ విజయ జ్యోతి, మెప్మా పిడి నాగశివలీల, డిఆర్‌డిఎ పిడి సలీం బాషా, విభిన్న ప్రతిభావంతుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

రావమ్మా ఓ కోయిలమ్మా!

ఎందుకమ్మా కోయిలమ్మా
మా ఇంటి ముంగిట నీ పాట లేదు?
నీ యింటి ముంగిట చెట్లేది
యింటి నిండా ప్లాస్టిక్ చెట్లే
మల్లె మందారాల పరిమళాలు ఏవీ
లేమావి చివుళ్ళు, వేప చెట్టు నీడ ఏదీ, నా గూటిని పెకలించి
భవంతులు కట్టావే, నాకు నెలవెక్కడ, నా పాటకు ఉనికి ఎక్కడ,
నీరు అందకుండా చెరువులు పూడ్చి పట్టణాలు కట్టు కున్నావు,
రెండు నీటి చుక్కలతో
గొంతు తడుపు కుందామంటే
ఓవర్ హెడ్డు ట్యాన్ కులో
గంగమ్మను బంధించావే
శివయ్య తన జటాఝటం లో
గంగమ్మ తల్లిని బంధించినా
మనుషులకు అందనిచ్చాడే..
నీ స్వార్థానికి భానుడు కన్నెర్ర
జేసి నిప్పులు కురిపిస్తుంటే
చుక్క నీరు అందనివ్వని నీ
యింటికి నేనెలా రావాలి
ఎండ మావుల వెంట పరుగులు
పెట్ట డానికి నేను నీలా మహా జ్ఞానిని కాదే... నీకు అందివ్వమని
భూ దేవికి వరుణుడు ఇచ్చిన నీటిని
కాల ద్రోసి, చంద్రునిపై గుంత లు
త్రవ్వి నీటి కోసం అన్వేషిస్తావువసంతునికి
పచ్చటి ఫల పుష్పాదులతో వసంతునికి స్వాగతం పలికే
నీచల్లని ప్రేమ కుటీర మేదీ నీ పది అంతస్తుల భవంతిలో
నాకు చోటేది?
అర్థమయ్యింది నేస్తమా ఓ కోయిలమ్మా, యీ క్రోధినామ వత్సరం
నాపయి క్రోధ మేల? నీ మాటే పాటిస్తాను
నా హృదయ కుటీరాన్ని నీకు అంకిత మిస్తున్నాను
నీహిత బోధతో రూపాంతరం
చెందిన నా అంతరాత్మను వింజామర చేసి నీకు వీవన వీస్తాను,
నీ తియ్యటి మంద లింపు తో కరిగి నీరయిన నా మనసుతో
నీ దాహం తీర్చుకో, రావమ్మా కోయిలమ్మా, నా కోసం గొంతెత్తి
పాడు, నా మనసే నీకు నందన వనం చేస్తాను....



- డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా (ఉగాది సందర్భం)



విద్యార్థులతో అధ్యాపకులు

జి.పుల్లయ్య ఎంబిఎ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నగర శివారులోని వెంకయ్యపల్లిలోని జి.పులయ్య ఇంజనీరింగ్ కళాశాల ఎంబిఎ విద్యార్థులు కెవి.సుబ్బారెడ్డి స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ వారు నిర్వహించిన నేషనల్ లెవెల్ మేనేజ్మెంట్ మీట్ ఉన్నతి- 2024 లో ప్రతిభ కనపరిచారు. రెండు రోజులు నిర్వహించిన నేషనల్ లెవెల్ మేనేజ్‌మెంట్ మీట్ పోటీలలో జి.పుల్లయ్య ఎంబిఎ విద్యార్థులు హెచ్ఆర్ యాక్టివిటీలో మొదటి బహుమతి జి.శ్రావణి, కె.ప్రీతి, ఎం.పల్లవి అందుకున్నారు. ఫైనాన్స్ యాక్టివిటీలో రెండవ బహుమతి ఎండి.బుష్రా, మహీన్ చాందిని బేగం బహుమతిని అందుకున్నారు. మిస్ ఉన్నతి మొదటి బహుమతి టి.ఈశ గెలుచుకున్నారు. ఇందులో భాగంగా కాలేజ్ నిర్వహించిన అభినందన సభలో డాక్టర్ సి. శ్రీనివాసరావు ప్రిన్సిపల్ విద్యార్థులను అభినందించారు. ఇంకా గొప్ప స్థాయికి ఎదగాలని మరిన్ని పోటీలలో విద్యార్థులను పాల్గొనాలని వాళ్లకు కితాబ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీన్ అడ్మిన్ డాక్టర్ ఎం.గిరిధర్ కుమార్ , డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ శశి కుమార్ పాల్గొన్నారు.



ప్రదర్శన అనంతరం ప్రమాణం చేయిస్తున్న కమిషనర్ భార్గవ్ తేజ

ఓటు వినియోగం పై వినూత్నరీతిలోఅవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

2024సాధారణ ఎన్నికల్లో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి సృజన ఆదేశాల మేరకు సోమవారం స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్ల అవగాహన అవగాహన ర్యాలీ నర్వహించారు. కర్నూలు నగరపాలక సంస్థ చెత్త సేకరణ వాహనాలతో వినూత్న రీతిలో ర్యాలీ చేపట్టారు. నగర పౌరులు ఓటు హక్కు వినియోగం కల్పించడం కోసం కర్నూలు రిటర్నింగ్ అధికారి ఎ. భార్గవ తేజ, అదనపు కమిషనర్ పివి. రామలింగేశ్వర్, కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేయించి ర్యాలీని ప్రారంభించారు. రిటర్నింగ్ అధికారి, అదనపు కమిషనర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. విశ్వేశ్వర్ రెడ్డి లు బైక్ ర్యాలీని ముందుండి నడిపించారు. ఈ ర్యాలీ కళాబృందం ఓటర్లను జాగతం చేస్తూ నినాదాలు,గానాలతో మహావీర్ సర్కిల్, పాత కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్ జిల్లా పరిషత్, రాజ్ విహార్, మెడికల్ కాలేజ్, గాయత్రి ఎస్టేట్, సి క్యాంప్ మీదుగా నంద్యాల చెక్‌పోస్టు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ సెక్రటరీ నాగరాజు, ఎఇ. దినేష్, సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ పెంచలయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

పత్తికొండ స్వతంత్ర అభ్యర్థిగా గద్దల రాజ్

ప్రజాశక్తి- పత్తికొండ



పత్తికొండ 142 అసెంబ్లీకి ఇండిపెండెంట్ అభ్యర్థిగా గద్దల రాజు బరిలో నిలువనటు్ల ఆయన తెలిపారు. ఆదివారం పత్తికొండ పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గద్దల రాజు మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని తపనతో నేను ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నానని అన్నారు. గతంలో అనేక పార్టీల నుండి గెలుపొందిన ఎమ్మెల్యేలు పలు కీలకమైన మంత్రుల పదవులు చేపట్టినా పత్తికొండ అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. నియోజవర్గంలో తాగు, సాగునీరు అందించ డంలో కూడా స్థానిక ఎమ్మెల్యేలు విఫలమయ్యారన్నారు. ఇచ్చిన హామీ లను నెరవేర్చకుండా ఐదేళ్ల కాలాన్ని సునయాసంగా గడుపుతూ నియోజకవర్గ పట్ల ఆలోచించ కుండా ఉన్నారన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఎలాంటి ఉపాధి పరిశ్రమలు తీసుకు రాలేదన్నారు. టమోటో జ్యూస్ ఫ్యాక్టరీ, పాలిటెక్నిక్ కాలేజీ తెస్తామనిశిలాపలకాల ప్రారంభోత్సవాలకే పరిమితం చేశారన్నారు. వీటినన్నిటిని దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గ ప్రజలు నిరుద్యోగ యువతీ యువకులు ఒకసారి యువకునిగా నాకు అవకాశం కల్పిస్తారని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా ప్రజలకు శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ సోమవారం ఓ ప్రకటనలో డిసిసి అధ్యక్షుడు కె.బాబురావు తెలిపారు. ఈ పండుగను జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



అభివృద్ధికి ఓటు వేయండి : ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి - వెల్దుర్తి

నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పారిపాలన సాగిస్తూ అన్ని వర్గాల ప్రజలకు మంచి చేసిన వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విన్నవించారు. సోమవారం బోగోలు, గువ్వలకుంట్ల గ్రామాలలో ఎమ్మెల్యే తనయుడు కంగాటి రామ్మోహన్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సిఎం జగనన్న కుల, మత, పార్టీ భేదం లేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలందించారని, సిఎం సహకారంతో నియోజకవర్గంలో, వెల్దుర్తి మండలంలో అనేక అభివృద్ధి పనులు, ప్రజలకు సౌకర్యాలు కల్పించామని గుర్తుచేశారు. గత టిడిపి పాలన, ప్రస్తుత వైసిపి పాలనలో అమలుచేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను బేరీజు వేసుకోవాలని కోరారు. టిడిపి నాయకులు ఎన్నికలు రావడంతో ప్రజల ఇళ్ల వద్దకు వస్తున్నారని లేకపోతే వచ్చేవారే కాదన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్య తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశానన్నారు.



టిడిపి నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మవద్దని, నెరవేరని హామీలు ఎన్నైనా ఇస్తారని అలాంటి వారికి మరోసా గట్టిగా బుద్ధిచెప్పాలన్నారు. పార్టీలు, కుల మతాలకతీతంగా అందరి క్షేమం కోరుతూ సాగిన వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని, ఎమ్మెల్యే- తనకు, ఎంపిగా బివై. రామయ్యకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సుంకన్న, వెంకట్రామిరెడ్డి, అల్లుగుండు శ్రీరామ్ రెడ్డి, కమలాకర్ వెల్దుర్తి మండల వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

15 వార్డులో డ్రైయినేజీ అస్తవ్యస్తం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణంలోని 15వ వార్డులోని శ్రీరాముల పేట, కల్లుపెంట కాలనీలో డ్రైయినేజీ అస్తవ్యస్తంగా మారింది. డ్రైయినేజీలో చెత్తాచెదారం చేరుకొని దోమలతో కాలనీవాసులు నానా అవస్థలు పడుతున్నారు. దోమలు రాత్రి వేళల్లో నిద్ర పట్టకుండా చేస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో బ్లీచింగ్ పౌడర్, దోమల స్ప్రేచేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని కాలనీవాసులు మండ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీలను శుభ్రం చేసి దోమల నివారణ చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. ప్రజల అవస్థలు పట్టని గ్రామపంచాయతీ పాలకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.

ఉగాదికి ధరాఘాతం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/ఆదోని రూరల్

తెలుగు వారి కొత్త సంవత్సరం 'ఉగాది'. పూర్వం నుంచి ఉగాది పండుగకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఉగాది రోజున తినే పచ్చడికి మరింత ప్రత్యేకత ఉంది. దీని వెనుక చాలా కారణాలు ఉన్నాయి.ఉగాది పచ్చడి తింటే ఎంతో ఆరోగ్యం.తీపి, చేదు, వగరు, పులుపు, కారం,ఉప్పు కలిపి ఉగాది పచ్చడిని చేస్తారు. వచ్చే కాలాల్లో ఆరోగ్యంగా ఉండేందుకు ఈ షడ్రుచులు కలిపిన ఉగాది పచ్చడి తినాలి అని పెద్దలు చెబుతూ ఉంటారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉగాదికి భక్షాలు చేసుకుంటారు. నిత్యావసరాల ధరలు భగ్గుమంటుండటంతో సామాన్యునికి ఉగాదికి దరాఘాతం తప్పడం లేదు. బక్షాలకు ఉపయోగించే సరుకుల్లో బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.180 పలుకుతుండగా, వంటనూనె రూ.120కుపైగా, బెల్లం కిలో రూ.80, మైదా పిండి కిలో 50 రూపాయలు, ఒక్క టెంకాయ 20 రూపాయలు పైగా ఇలా అన్ని రకాల ధరలు ఆకాశంలో ఉన్నాయి. మోడీ సర్కార్ వచ్చిన తర్వాత రూ.430 ఉండే గ్యాస్ సిలిండర్ కాస్తా ప్రస్తుతం రూ.1000కి చేరింది. ఏదైనా పిండివంట చేయాలంటే తక్కువగా లెక్కించినా రూ.3 వేలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. దీంతో పిండి వంట చేసేందుకు సామాన్య ప్రజానీకం ముందుకు అడుగువేయలేని దుస్థితి నెలకొంది. ఉగాది పండుగకు ప్రత్యేకమైన షడ్రుచులు ఏర్పాటు చేయాల్సిన వస్తువులు ఒక సెట్టు రూ.50 పలుకుతోంది. నిత్యావసర వస్తువులతోపాటు అన్నిరకాల ధరల పెరుగుదల సామాన్య ప్రజానీకాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.సామాన్యులు ఎక్కువగా జరుపుకునే పండుగ ఉగాది పండుగను అత్యంత వైభవంగా జరుపుకోవాలని తహతహలాడతారు. ప్రతిఒక్కరూ తమ బంధువులను పండుగకు ఇంటికి పిలుచుకుని ఆనందంగా గడుపుతారు. పిండివంటలు చేసుకోవడంతోపాటు కొత్త బట్టలు పెద్దఎత్తున కొనుగోలు చేస్తారు.అయితే అందనంత ఎత్తుకు అన్నిరకాల ధరలూ పెరిగిపోవడంతో సామాన్య ప్రజానీకం ఇళ్లలో పండుగ సందడి కానరావడం లేదు. గతంలో రూ.500 పలికే బట్టలు ఇప్పుడు రూ.వెయ్యికి చేరాయి. చిన్న పిల్లల దుస్తులైతే మరింత ధర పలుకుతున్నాయి. దీంతో కుటుంబం అంతా బట్టలు కొనుగోలు చేసుకోకుండా పిల్లల వరకూ కొనుగోలు చేసి చాలా కుటుంబాలు సర్దుకుంటున్న పరిస్థితి కన్పిస్తోంది.

కూరగాయల ధరలకూ రెక్కలు

కూరగాయల ధరలు సైతం విపరీతంగా పెరిగిపోయాయి. వంకాయలు కిలో రూ.60, టమాట కిలో రూ.40, ఆలుగడ్డ కిలో రూ.40 ఉంది. అల్లం కిలో రూ.200, పచ్చిమిరపకాయలు కిలో రూ.56కు విక్రయిస్తున్నారు. పూల ధరలు అయితే మరింత ఆకాశాన్ని ధరలుంటాయి. దీంతో నిత్యావసర,కూరగాయల ధరలు సైతం అందనంత ఎత్తుకు చేరుకుంటున్నాయి. కుటుంబమంతా కష్టపడినా నెలకు రూ.పది వేలు సంపాదించడం గగనంగా మారింది. ఇలాంటి కుటుంబాలు పెరిగిన ధరలతో రూ.వేలు ఖర్చు పెట్టి పండుగను సంతోషంగా ఏవిధంగా జరుపుకుంటాయో ప్రభుత్వాలే చెపాల్సి ఉంది. సామాన్యులకు ఉచితంగా ఏదో ఇచ్చేస్తున్నట్లు గొప్పలు చెబుతున్న ప్రభుత్వాలు,ధరల రూపంలో పీల్చిపిప్పి చేస్తున్నాయి. దీంతో ఒకప్పుడు ఎంతో సంతోషంగా జరిగే పండుగలు నేడు వెలవెలబోతున్నాయి.

సరుకులు కొనడం కష్టమే



మార్కెట్లో కొద్ది రోజులుగా నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. రూ. 500 నుంచి రూ. వెయ్యి పెడితేగాని వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. డిమాండ్ మేరకు సప్లయ్ కాకపోవడం వల్లే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. గడిచిన నెల రోజుల్లో కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. అధికారులు ధరలకు కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాలి.

- భీమమ్మ, ఆదోని పట్టణ వాసి.

కర్నూలు అసెంబ్లీ సిపిఎం అభ్యర్థిగా గౌస్ దేశాయ్

మొదటి పేజీ తరువాయి... సిఐటియు జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. 2010 నుండి 2017 వరకు పార్టీ కర్నూలు నగర కార్యదర్శిగా, 2018 నుండి 2022 సిఐటియు జిల్లా కార్యదర్శిగా ప్రస్తుతం సిపిఎం జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్నారు. భార్య డి.రషీద కూడా మహిళా సంఘం నగర అధ్యక్షురాలిగా, సిపిఎం నగర కమిటీ సభ్యురాలిగా ఉన్నారు.

ప్రధాన ఆందోళనలు, పోరాటాలు : 1989లో నిరుద్యోగ సమస్యపై కర్నూలు జిల్లా వ్యాప్తంగా సైకిల్ యాత్రకు నాయకత్వం వహించి పాల్గొన్నారు. విద్యుత్ పోరాటంలోను, ఇళ్ళస్థలాలు, భూమిలేని నిరుపేదలకు భూపి ఇవ్వాలని కోరుతూ 2005లో హైదరాబాద్ లోని బాగ్‌లింగంపల్లిలో జరిగిన నిరవధిక దీక్షలో కర్నూలు జిల్లా నుండి 6 రోజుల పాటు నిరవదిక దీక్షలో పాల్గొని కోనేరు రంగారావు కమిటీ ఏర్పాటుకు కృషి చేశారు. 2010లో కర్నూలు నగరంలో ఇళ్ళ స్థలాల సమస్యపై 6 రోజుల పాటు నిరవధిక దీక్షల్లో పాల్గొని ప్రభుత్వం నుండి రాత పూర్వక హామీ వచ్చేలా కృషి చేశారు. అలాగే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని, కర్నూలు జిల్లా సమగ్రాబివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ 2018లో ఒకసారి, 2023లో మరోసారి పాదయాత్ర చేసి ప్రభుత్వపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఆర్‌టిపి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాల్గొనడంవల్ల 13 రోజుల పాటు కడప సెంట్రల్ జైలుకు కూడా వెళ్ళారు. కర్నూలు నగరంలో ప్రజా సమస్యలపై చేస్తున్న ఉద్యమాల కారణంగా అనేక కేసులు మోమపడ్డాయి.

వైభవంగా ప్రభోత్సవం

పారాయణలు, స్వామివారికి విశేషార్చనలు, అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు ప్రత్యేక అర్చకులతో నిర్వహించారు. సాయంకాలం రథశాల వద్ద ప్రభను వివిధ రకాల పూలతో అలంకరించి ప్రభోత్సవంను నంది గుడి నుండి బయల్దేరి రథశాల వరకు ఘనంగా నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ప్రాంగణంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నంది వాహనంపై ఏర్పాటు చేశారు. మహా సరస్వతి అలంకారంలో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత వేదమంత్రాలు, విద్యుత్ దీపాలంకరణల మధ్య, వివిధ రూపాల కళా నృత్యాలు, తప్పెట చిందు, కోలాటం, చెక్కభజన, నందికోలు సేవ, కర్ణాటక జాంజ్ తదితర నృత్య ప్రదర్శనల మధ్య నంది వాహనంపై స్వామి అమ్మవార్లను, మహాసరస్వతి అలంకారంలో ఉన్న అమ్మవారిని ఆలయ ప్రాంగణం నుండి ఆలయ రాజగోపురం గుండా ప్రధాన వీధుల్లోకి ప్రవేశింపచేశారు. అక్కడ గంగాధర మండపం వద్ద నుండి నంది గుడి, బయలు వీరభద్ర స్వామి, ఆలయంలోకి అత్యంత వైభవంగా వేలాదిమంది భక్తుల మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు : క్షేత్రానికి వచ్చిన భక్తులను అలరించేందుకు దేవస్థానం శివదీక్ష శిబిరాలలో, పుష్కరిణి, నిత్యకళావేదికలపై శ్రీశైలం జగద్గురు ట్రస్ట్ వారిచే కన్నడ, తెలుగు భాషలలో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి రంజని పాటలతో భక్తుల కోసం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలను సాయంత్రం ఐదు గంటల నుండి రాత్రి పది గంటల వరకు నిర్వహించారు.

స్వామి అమ్మవార్లకు ఏకాంత సేవ : స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం అనంతరం ఏకాంతసేవ నిర్వహించారు. ఆ తరువాత శివ దీక్షా శిబిరాల్లో అగ్ని గుండం ఏర్పాటు చేసి కన్నడ భక్తులు వీరాచార విన్యాసాలు చేశారు. చువ్వలతో పెదాలకు, బుగ్గలకు, మెడకు గుచ్చుకోవడం వంటి విన్యాసాలు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. క్షేత్ర పరిధిలో శివదీక్షా శిబిరాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందో బస్తు ఏర్పాటు చేయడం జరిగింది.

శ్రీశైలం కన్నడిగుల మయం : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న ఉగాది మహెూత్సవాలలో స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి లక్షల సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకున్నారు. సుమారు 800 కిలోమీటర్ల నుండి కాలినడకన పాదయాత్రగా రోజుకు 25 కిలోమీటర్లు నడక నడుచుకుంటూ మార్గమధ్యలో విశ్రాంతి తీసుకుంటూ క్షేత్రంలో ఉత్సవాల ప్రారంభం రోజుకు శ్రీశైలం చేరుకున్నారు. వీరికి మార్గ మధ్యలో దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఉచిత అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. భక్తుల రాకతో శ్రీశైల క్షేత్రమంతా కన్నడిగుల మయంగా మారింది.



గ్రామోత్సవంలో పాల్గొన్న ఇఒ దంపతులు తదితరులు

ఓటర్లకు విస్తృత అవగాహన : డిఆర్ఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



జిల్లాలో ప్రతి ఒక్కరు నిర్భయంగా, తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు డిఆర్ఓ పద్మజ తెలిపారు. సోమవారం ఆమె ప్రజాశక్తి తో మాట్లాడుతూ ఐదేళ్లకు ఒకసారి వచ్చేఎన్నికల్లో ప్రతిఒక్కరు ఓటు హక్కును ఉపయోగించుకొని ప్రజాస్వామ్యం కు బాటలు వేయాలన్నారు..జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గం లో రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఓటింగ్ శాతం పెంచేలా స్వీప్ ప్రోగ్రామ్ జరుగుతుందన్నారు.

ఎన్నికల సిబ్బంది కి వైద్య పరీక్షలు : ఎన్నికల విధుల కేటాయించిన సిబ్బంది ఎన్నికల విధులనుండి ఇవ్వాలని వినతులు వస్తున్నాయని బెడ్ రెస్ట్, నడవలేని వాళ్లు పూర్తి అనారోగ్యంతో ఉన్నవాళ్లకే జిల్లా ఎన్నికల అధికారి నుండి మినహాయింపు ఉంటుందని, లేనివారికి ఎలాంటి మినహాయింపు ఉండదని డిఆర్ఓ తెలిపారు. అత్యధికంగా వినతులు వస్తున్న నేపథ్యంలో ఆరవ తేదీ నుండి విన్నవించుకున్న సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరికైతే మెడికల్ సర్టిఫికెట్ లో జెన్యూన్ ఉంటుందో వారికి మాత్రం మినహాయింపు ఉంటుందన్నారు.

ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి నంద్యాల కలెక్టరేట్



సార్వత్రిక ఎన్నికల సమర్థవంత నిర్వహణకు సూక్ష్మస్థాయి ప్రణాళికతో పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల సంసిద్ధత, వడగాల్పులపై జిల్లా కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 18వ తేదీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. కోడ్ అమలులో ఉన్నప్పటి నుండి ఇప్పటివరకు రూ. 4.9 కోట్ల విలువైన నగదు, లిక్కర్, ఇతర వస్తువులను సీజ్ చేసామన్నారు. సీజ్ చేసిన నగదును సంబంధిత వ్యక్తులు సరైన ఆధారాలతో వస్తే డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీ ద్వారా తిరిగి చెల్లింపులు చేస్తున్నట్లు వివరించారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్, ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా రాజకీయ ప్రచారాలకు సంబంధించి అనుమతి కోసం ఇప్పటివరకు 529 దరఖాస్తులు అందగా 433 మంజూరు చేశామని, 49 తిరస్కరించామని తెలిపారు. 28 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. కోడ్ ఉల్లంఘనలో భాగంగా 22 మంది వాలంటరీలను తొలగించడంతో పాటు ఒక అంశంలో కేసును కూడా నమోదు చేశామన్నారు. ఒక కాంటాక్ట్ ఎంప్లాయిని తొలగించడంతో పాటు రెగ్యులర్ ఎంప్లాయ్ ఒక టీచర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు 47 మంది రెగ్యులర్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. అలాగే ఒక డీలర్‌ను, ఎండియు ఆపరేటర్‌ను కూడా తొలగించామన్నారు. రాజకీయ పార్టీ అనుచరులకు సంబంధించి టిడిపి 10 మంది, వైసిపి 15 మందిపై కేసులు పెట్టామన్నారు. ఓటర్ల జాబితాకి సంబంధించి కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లు దాదాపు 12,000 మంది పెరిగినట్లు తెలిపారు.

వడగాల్పులపై అప్రమత్తంగా ఉండండి : నంద్యాల జిల్లాలో రోజురోజుకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు, ఉపాధి కూలీలు ఎండ తీవ్రత పట్ల జాగ్రత్తగా ఉండేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని వివరించారు.



రాజీనామా పత్రాలను అధికారులకు అందజేస్తున్న వాలంటీర్లు

36 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణ, రేగడగూడూరు గ్రామ వాలంటీర్లు 36 మంది ఒక్కసారిగా రాజీనామా చేశారు. సోమవారం వైసిపి అధ్యక్షులు అంబాల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వాలంటీర్లు మాట్లాడారు. జగనన్న కోసం, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కోసం వారు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లడానికి వాలంటీర్లుగా విధులు నిర్వర్తించమని అన్నారు. ప్రస్తుతం వారి కోసమే రాజీనామాలు చేస్తున్నా మని, మేము సిద్ధంగా ఉన్నామంటూ వెలుగోడు ఎంపిడిఓ సిబ్బంది ఏఓ (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) సయ్యద్ ఉమర్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

వెట్టి చాకిరి నిర్మూలన అందరి బాధ్యత

-సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి

ప్రజాశక్తి - ఆత్మకూరు : బాల కార్మిక నిర్మూలన. వెట్టి చాకిరి నిర్మూలన అందరి బాధ్యత అని ఆత్మకూరు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర రావు అన్నారు. సోమవారం వివిధ శాఖల అధికారులతో స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా బాల కార్మికులు వెల్డింగ్ షాపులను మెకానిక్ షాపుల్లోనూ హొటలలోను పనిచేస్తూ ఉంటారని అలాంటి వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి వారిని పాఠశాల పంపించే బాధ్యత అందరిపై ఉందన్నారు ఈ దిశగా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు పని చేయాలని ఆయన సూచనలు చేశారు. అనంతరం ఐ సి డి ఎస్ న్యాయవాదులు స్వచ్ఛంద కార్యకర్తలు పట్టణంలోని దుకాణాలలో తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

సకాలంలో పన్ను చెల్లింపుతో రాయితీ : కమిషనర్

ప్రజాశక్తి-డోన్ : 2024 -2025 ఆర్థిక సంవత్సరం సంబంధించి ఇంటి పన్నులు ఏప్రిల్ 30వ తేదీ లోపల చెల్లించిన వారికి పన్నులో 5 శాతం రాయితీ పొందగలరని డోన్ మున్సిపల్ కమిషనర్ యస్.జయరాం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెలవు రోజులలో కూడా మున్సిపా లిటీలో కౌంటర్లు ఉంటాయని తెలిపారు.

చెక్ పోస్ట్‌ల వద్ద ముమ్మర తనిఖీలు

- 24 గంటల పాటు నిరంతర గస్తీ

ప్రజాశక్తి- గడివేముల : ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో చెక్ పోస్టుల వద్ద సోమవారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. కేంద్ర బలగాలు, పోలీసులు సంయుక్తంగా ఆటోలు ,కార్లు ,ఇతరత్ర వాహనాలను వీడియోల ఆధారంగా చెక్ చేశారు. ఎన్నికల నియమావళి అమలులో ప్రత్యేక బృందాలు ,పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. మండలంలో ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్ ల వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎన్నికలు పురస్కరించుకొని నగదు, మద్యం ఇతర వస్తువులను ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తరలించే వారిపై నిఘా పెంచారు. ప్రయాణాల్లో తీసుకెళ్లే నగదుకు సంబంధించి సరైన పత్రాలు కచ్చితంగా ఉండాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని గడివేముల ఎస్సై బీటి వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. తనిఖీల్లో ఏవో చంద్రశేఖర్, పోలీస్ కానిస్టేబుల్ రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



కాలిపోయిన అరటి పంటతనిఖీలు చేస్తున్న పోలీసులు

పేదలు బాగుండాలంటే వైసిపి రావాలి

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి



ప్రచారం చేస్తున్న బుగ్గన నాగభూషణం రెడ్డి, బాబుల్ రెడ్డి



ప్రచారం చేస్తున్న అర్జున్ అమర్నాథ్ రెడ్డి



ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్న గంగుల అవంతికారెడ్డి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కోట వీధి 18,19వ వార్డులో సోమవారం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నందికొట్కూరు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ధార సుధీర్, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానంద రెడ్డిలను గెలిపించాలని గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు బాగుండాలంటే మళ్ళీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని, ప్రతిపక్షాలు ఎన్.డి.ఎ కూటమిగా ఏర్పడి వైసిపి పై యుద్ధం చేస్తున్నారని అన్నారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, యువ నాయకులు ఎక్కలదేవి చంద్రమౌళి, ఎంపీపీ మురళికృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షులు మన్సూర్, చింతా విజ్జి, ఉస్మాన్ బేగ్, మండల అధ్యక్షులు రవి యాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు జబ్బార్, బద్దుల శ్రీకాంత్, కౌన్సిలర్ కాటెపోగు చిన్నరాజు, లాలు ప్రసాద్, కాశ్మూరి శివ ప్రసాద్, లడ్డూ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బుగ్గనను మెజార్టీతో గెలిపించండి

- బుగ్గన నాగభూషణం రెడ్డి, బాబుల్ రెడ్డి

బేతంచెర్ల : మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబు రెడ్డి కోరారు. మండల పరిధిలోని ఆర్. బుక్కాపురం గ్రామంలో ఎంపిటీసీ మునేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రెండుసార్లు డోన్ ఎమ్మెల్యేగా ఎన్నికై నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ముందు బాగాన ఉండేవిధంగా అభివృద్ధి చేశారని ముచ్చటగా మూడోసారి బుగ్గనను గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మూర్తి జావలి, రాష్ట్ర మైనార్టీ ఫైనల్స్ డైరెక్టర్ ఖాజా హుస్సేన్, మదిని స్వామి చైర్మన్ సీతారామ చంద్రుడు,మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, ఎర్రమల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బుగ్గనను గెలిపించుకోవాలి

- అర్జున్ అమర్నాథ్ రెడ్డి

డోన్ : డోన్ నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమం కావాలంటే ప్రజలు ఆలోచించి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని వైసీపీ యువనేత అర్జున్ అమర్నాథ్ రెడ్డి అన్నారు. డోన్ పట్టణంలోని ప్రధాన కుడళ్ళలో రహదారి పక్కన ఉన్న వ్యాపారస్తులకు మంత్రి బుగ్గన చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రతి గడపకు వెళ్లి బుగ్గనను గెలిపించాలని యువనేత అర్జున్ అమర్నాథ్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్,రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం. శ్రీరాములు,ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు సట్టి రాజశేఖర్, డోన్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ టియి.దినేష్ గౌడ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వైఎస్ఆర్ రఫీ,వైసిపి నాయకులు మేకల నాగరాజు, మిట్టారవి తదితరులు పాల్గొన్నారు.

పాణ్యంలో కాటసాని గెలుపు ఖాయం

- కాటసాని శివ నరసింహారెడ్డి



ప్రచారం చేస్తున్న కాటసాని శివ నరసింహారెడ్డి

గడివేముల : పాణ్యం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందాతారని కాటసాని శివ నరసింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గడివేముల మండలంలోని కరిమద్దెల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో కాటసాని శివ నరసింహ రెడ్డి పాల్గొని ఇంటింటింకి వెళ్ళి కాటసాని రామ్ భూపాల్ రెడ్డిని మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆర్బికే చైర్మన్ పుల్లయ్య, మాజీ సర్పంచ్ డాలు స్వామి, కష్ణారెడ్డి, వైసిపి నాయకులు దస్తగిరి రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షులు శివరామిరెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, మేఘనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిజేంద్రారెడ్డిని ఆదరిస్తే మరింత అభివృద్ధి

- గంగుల అవంతికారెడ్డి

చాగలమర్రి : మరోసారి ఎమ్మెల్యేగా వైసిపి అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డిని ఆదరిస్తే ఆళ్ళగడ్డ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారని ఆయన సోదరి గంగుల అవంతికారెడ్డి కోరారు. మండలంలోని పెద్దవంగలిలో ఆమె ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తన సోదరున్ని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. సర్పంచ్ బంగారు షరీఫ్, జడ్పిటీ సి లక్ష్మిదేవి, ఎంపిటీసి లక్ష్మిరెడ్డి ,వైసిపి మం డల కన్వీనర్ కుమార్ రెడ్డి,రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి రమణ,జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు : నందికొట్కూరు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారసుధీర్ దేవనూరు, సున్నంపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటిఇంటికి వెల్లి జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటువే యాలని ఓటర్లను అభ్యర్థించారు. దేవనూరు తెలుగుదేశం పార్టీకి చెందిన చిన్నమౌల, అన్వర్ భాష, ఆరప్ఆలీ,డి నారాయణ,అక్బర్ బాష, నూర్‌ల్లా దార సుధీర్ సమక్షంలో వైసిపిలో చేరారు. సర్పంచ్ హారిత, ఎంపిటిసి పరిదా,చిన్న అయ్యన్న,నవదలి,కొ ఆప్షన్ పెద్దమౌలా, పీరుషాబ్ పేట సోసైటీ చైర్మన్ తమిదల నాగతులసిరెడ్డి, తువ్వా శివరామ కృష్ణారెడ్డి, మండల కన్వినర్ తువ్వా లోకేశ్వర రెడ్డి, వైసిపి జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ రాముడు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ధార సుధీర్

బిసిలకు వెన్నుదన్నుగా టిడిపి : కోట్ల



మాట్లాడుతున్న కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి



ఇంటింటి ప్రచారంలో జయసూర్య

ప్రజాశక్తి - ప్యాపిలి

రాష్ట్రంలో బీసీలకు తెలుగుదేశం పార్టీ వెన్నుదన్నుగా నిలిచిందని డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి జయసూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. పోతుదొడ్డి గ్రామంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వర రావు యాదవ్ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా డోన్ టిడిపి అసెంబ్లీ అభ్యర్థి కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి శబరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఉమ్మడి రాష్ట్రంలో నాడు దివంగత ఎన్టీఆర్ పార్టీ స్థాపించినప్పటి నుండి బీసీలు రాజకీయాల్లో పురోగమిం చారని అన్నారు. చంద్రబాబు బీసీల పక్షపాతి అని, టిడిపి అధికారంలోకి రాగానే 50 ఏళ్లు పైబడిన బీసీలకు రూ.4000 పెన్షన్ అందజేయనున్నారని తెలిపారు. సైకిల్ గుర్తుపై వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్కసాగరం లక్ష్మిరెడ్డి, వై నాగేశ్వరరావు యాదవ్,మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణమూర్తి, ఆర్ ఈ నాగ రాజు, రామసుబ్బయ్య, రామ్మోహన్ యాదవ్, రజని,కోదండ, రమేష్, సుంక న్న, ఓబులేసు, నారాయణ, కదిరప్ప, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే బీసీల అభివృద్ధి

- మాండ్ర శివానందరెడ్డి

పాములపాడు : రాష్ట్రంలో బీసీల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని రుద్రవరం గ్రామంలో నిర్వహించిన జయహొ బీసీ కార్యక్రమానికి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్యలు హాజరై మాట్లాడారు. శివానందరెడ్డి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్లకు ఎలాంటి నిధులు ఇవ్వలేదన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ చట్టం తెస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రవీంద్రనాథ్ రెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, హరినాద్ రెడ్డి, గోవిందు, చంద్రశేఖర్, సురేష్, కరీం భాషా, మధు, కృష్ణ, అబ్దుల్ హఫీస్, శివశంకర్ స్వామి, పూసల కృష్ణ, సాములు, లింగాల సర్పంచ్ బాలమల్లీశ్వర రెడ్డి, జనార్దన్ రెడ్డి, రాము చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి వస్తే మహిళలకు పెద్దపీట

- జయసూర్య

కొత్తపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలకు మేనిఫెస్టోలో టీడీపీ పెద్దపీట వేసిందని నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయ సూర్య తెలిపారు. మండలంలోని దుద్యాల గ్రామంలో మల్లారెడ్డి, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమంలో టిడిపి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇంచార్జి లింగస్వామి గౌడ్, బూత్ ఇంచార్జ్ రవి మాజీ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, మాజీ మండల కన్వీనర్ జడ్ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి, మన్సూర్, సుదర్శన్ బాష, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి : ఆర్ఒ

ప్రజాశక్తి - గడివేముల : ఓటు హక్కును సద్వినియోగం చేసుకో వాలని నినాదంతో సోమవారం తాసిల్దార్ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు రిటర్నింగ్ ఆఫీసర్ నరపరెడ్డి మోరియా ఆధ్వ ర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్ ఆవరణంలో రెవెన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది మనోహరంగా ఏర్పడి ఓటు హక్కును అందరు సద్వినియోగం చేసుకో వాలని నినాదించారు. రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని అన్నారు. సమస్యా త్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ కవాతు ప్రదర్శన నిర్వహిస్తున్నామని వివరిం చారు. తాసిల్దార్ జమనుల ఖాన్, డిప్యూటీ తహసిల్దార్ గురునాథం, ఎంపీడీవో శివరామిరెడ్డి, ఎస్సై బిటి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన : మండలంలోని గని మంచాలకట్ట గడివేముల పెసరవాయి గ్రామాలలో రిటర్నింగ్ ఆఫీసర్ నారపరెడ్డి మోరియా పోలింగ్ బూత్లను సోమవారం పరిశీలించారు. గడియంలో 306 బూతు నెంబర్లో వసతులు సరిగా లేవని సంబంధిత అధికారులు రెండు రోజుల్లో బూతులను మరమ్మతు చేయించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న ఆర్ఒ

ప్రాజెక్టులను పూర్తి చేయలేని వైసిపి

- మంత్రిగా చేయలేని ప్రాజెక్టులను విరుపాక్షి చేస్తారా..?
- టిడిపి ఎంపీ అభ్యర్థి నాగరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - ఆలూరు

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కర్నూలు జిల్లాలో ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని టిడిపి కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాడు నాగరాజు, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్ విమర్శించారు. సోమవారం టిడిపి ఆలూరు కార్యాలయంలో ఉమ్మడి పార్టీల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి, రాజకీయ కక్ష సాధింపు పాలనను సాగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని విమర్శించారు. మద్యం, ఇసుక, భూదందాను ప్రోత్సహించారని తెలిపారు. కరువు ప్రాంతం ఆలూరులో వేదవతి, నగరడోన ప్రాజెక్టులకు గత టిడిపి హయాంలో నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కాగా అధికారంలోకి వచ్చిన వైసిపి నామమాత్రంగా పనులు చేసి నిధులు లేక పనులు ఆపేశారని తెలిపారు. ఆలూరు నియోజకవర్గాన్ని మంత్రిగా జయరామ్ చేయలేని అభివృద్ధిని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి ఏ విధంగా చేయగలరని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వేదవతి, నగరడోన ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పేదల నడ్డి విరిచేలా నిత్యావసర ధరలు పెంచి సామన్యులపై భారం మోపారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి అన్ని వర్గాలకు మేలు చేస్తామని తెలిపారు. అభివృద్ధి చేసే టిడిపికే ప్రజలు పట్టం కట్టాలని కోరారు. అంతకుముందు దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిజెపి నాయకులు రవీంద్ర స్వామి, బసవరాజు, జనసేన పార్టీ నాయకులు చత్రపతి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కురువ జయరామ్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మనేకుర్తి రాజశేఖర్, టిడిపి మండల కన్వీనర్ అశోక్, నాయకులు గిరి, మల్లేష్ గౌడ్, నరసప్ప, నారాయణ, ప్రవీణ్, రామాంజినేయులు, హనుమప్ప, మారుతి, వన్నూర్ వలీ, మల్లికార్జున, బంగారు రామకృష్ణ, దేవేంద్ర, గోపి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు, వీరభద్ర గౌడ్

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- ప్రజలకు మంచి చేసే వైసిపికే ఓటు వేయండి
- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక తెలిపారు. సోమవారం పట్టణంలోని 16వ వార్డు కౌన్సిలర్ వాహీద్, పార్టీ శ్రేణులుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వార్డు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకకు వార్డు నాయకులు, కార్యకర్తలు అభిమానులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజలకు మంచి చేసే వైసిపికే రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలను దళారులు లేకుండా నేరుగా చేరవేసిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, ఆపదలో ఉన్నవారికి అన్ని విధాలుగా సహాయ, సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి తనను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా, కర్నూలు ఎంపీ అభ్యర్థి బివై.రామయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బుట్టా శివ నీలకంఠ, వార్డు నాయకులు బజారిరెడ్డి, జిక్రియ, ఖలీల్, గోవిందు, ఖాదర్, వైసిపి పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, పట్టణ ప్రతినిధి సునీల్ కుమార్, వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, టౌన్ బ్యాంకు ఛైర్మన్ యుకె.రాజశేఖర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కొండాపూరి అబ్రార్, కౌన్సిలర్లు ఖాసీం బేగ్, రాజారత్నం, డిష్ కేశవరెడ్డి, సుధాకర్, ఇన్‌ఛార్జీలు రామాంజి రెడ్డి, గట్టు ఖాజా, నాయకులు ఖిబులా హుస్సేని, ఇళయకత్, కెఎం.బాషా, యూసుఫ్, మంజునాథ్, బుట్టా యూత్ నాయకులు ఫయాజ్, ఉబెద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందవరం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే ప్రతి కుటుంబానికి సంక్షేమ పాలన అందిందని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక తనయుడు బుట్టా ప్రతుల్ తెలిపారు. సోమవారం మండలంలోని మిట్టా సోమాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్.జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా, తమ తల్లి బుట్టా రేణుకను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. అలాగే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ గ్రామస్తులను ఓట్లు అభ్యర్థించారు. అధికార దాహంతో టిడిపి నాయకులు చెప్పే మోసపూరిత హామీలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. వైసిపి మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్, బీసీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు విరుపాక్షి రెడ్డి, సర్పంచి నరసింహులు, మాజీ సర్పంచి లింగన్న, వైసిపి యువ నాయకులు తాయన్న, గురజాల సర్పంచి వీరస్వామి, నరసింహారెడ్డి, సోమలగూడూరు వెంకటేశ్వర రెడ్డి, జాన్, పోనకలదిన్నె సర్పంచి నాగరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బుట్టా రేణుక


ప్రచారం నిర్వహిస్తున్న బుట్టా ప్రతుల్

టిడిపి, వైసిపిలో ముదురుతున్న విభేదాలు

- అభ్యర్థులకు తలనొప్పిగా మారిన వైనం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య గ్రూపు విభేదాలు ముదురుతున్నాయి. గత కొన్ని రోజుల క్రితం వైసిపి కార్యాలయ ప్రారంభోత్సవానికి కర్నూలు ఎంపీ అభ్యర్థి బివై.రామయ్య, వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని ఓ గ్రూపునకు చెందిన రెడ్డి సామాజిక మండల నాయకులు హాజరు కాకపోవడంతో నాయకుల మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. అలాగే గత రెండు రోజుల క్రితం టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్ స్థానిక టిడిపి కార్యాలయం ముందు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, వివిధ గ్రామాల నుంచి హాజరయ్యారు. గుమ్మనూరు గ్రూపునకు చెందిన తెర్నేకల్ రాఘవేంద్ర, మల్లికార్జున వైసిపి నుంచి టిడిపిలో చేరారు. వీరభద్ర గౌడ్ నిర్వహించిన సమావేశంలో స్టేజిపైకి ఆహ్వానించారని అదే గ్రామానికి చెందిన చిన్న రాముడు, నాగేష్, తిమ్మప్ప సమావేశంలో గొడవకు దిగారు. దీంతో కొంతసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. టిడిపి టికెట్ ఆశించిన కోట్ల సుజాతమ్మ గ్రూపునకు చెందిన కొంతమంది టిడిపి నాయకులు వీరభద్ర గౌడ్ నిర్వహించిన సమావేశానికి హాజరు కాలేదు. దీంతో వైసిపి, టిడిపి నాయకుల విభేదాలు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఇరు పార్టీల అభ్యర్థులకు తలనొప్పిగా మారాయి. మండల జడ్‌పిటిసి కిట్టును జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ సురేందర్ రెడ్డి, వైసిపి ఎంపీ అభ్యర్థి బివై.రామయ్యలు ఆయన గృహానికి పెళ్లి వైసిపిలోకి ఆహ్వానించారు. జడ్‌పిటిసి రాకను కొంతమంది వైసిపి నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఆయా పార్టీల నాయకులు సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, లేకపోతే పార్టీలకు గండి పడే పరిస్థితి నెలకొందని మేధావి వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. ఆయా పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు గ్రూపు విభేదాలను ఏ మేరకు నియంత్రించి ఒకే తాటిపైకి నాయకులను తీసుకొస్తారో వేచి చూడాల్సిన పరిస్థితి ఉందని మేధావులు పేర్కొంటున్నారు.




బీవీ సమక్షంలో టిడిపిలో చేరుతున్న కార్యకర్తలు

టిడిపితోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే అభ్యర్థి బీవీ
- టిడిపిలో 100 మంది చేరిక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని 12వ వార్డు, 9వ వార్డుకు చెందిన వైసిపి, జనసేన కార్యకర్తలు ఉసేనప్ప నాయుడు, శ్రీనివాసులు నాయుడు, రియాజ్, రసూల్, పరమేష్, వీరేష్, రాజు, వెంకటేష్, దుర్గా, మహేష్, సుందర్ రాజు, ఇక్బాల్, రహిమాన్, వారి అనుచరులు సుమారు 100 మంది యువకులు టిడిపి 12వ వార్డు అధ్యక్షులు అల్తాఫ్ ఆధ్వర్యంలో బీవీ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణ అని పేరు ఉండేదని, తుగ్లక్ ముఖ్యమంత్రి హయాంలో ఆంధ్రప్రదేశ్ అంటే గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని విమర్శించారు. ఇటీవల టిడిపి, జనసేన ఉమ్మడి పార్టీలు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులమై టిడిపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. వారికి బీవీ టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టిడిపి నుంచి వైసిపిలో చేరిక


కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలోని వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి క్యాంపు కార్యాలయంలో బిజెపి, టిడిపి నుంచి వైసిపిలో చేరారు. సోమవారం ఆలూరు నియోజకవర్గం హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు బిజెపి, టిడిపి నుంచి వైసిపిలో చేరాయి. వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షికి తోడుగా ఉండాలని పార్టీలో చేరినట్లు సోమప్ప, వెంకటేష్, అంబయ్య, పి.సోమిరెడ్డి, సి.రమేష్, బి.ప్రమోద్, మోహన్, సోమప్ప, మంజు, లింగప్ప, నడిగడ్డ చిన్న దిబ్బలింగ, తలారి మరి లింగ, ఉల్కప్ప గారి మల్లప్ప తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ జూటూరు మారయ్య, ఆలూరు అసెంబ్లీ కో ఆర్డినేటర్ ఓబులేసు, నాగప్ప, వైసిపి రాష్ట్ర కార్యదర్శి జనార్ధన్ నాయుడు, హాలహర్వి మండల కన్వీనర్ రామిరెడ్డి, కో కన్వీనర్ మల్లికార్జున, బెల్డోన సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున, గూళ్యం కుమారస్వామి, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జీ రంజిత్, ఎ.గోపాల్, హాలహర్వి యూత్ అధ్యక్షులు గంగాధర్, కుమారస్వామి, విద్యా కమిటీ ఛైర్మన్ లింగన్న పాల్గొన్నారు.

30లోపు పన్ను చెల్లించాలి

- మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఇల్లు, ఖాళీ స్థలాలకు సంబంధించిన ఆస్తి పన్ను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి కోరారు. సోమవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈనెల 30లోపు చెల్లించి 5 శాతం రిబేట్ పొందాలని కోరారు. ఆస్తి పన్నును మొత్తంగా చెల్లిస్తే రాయితీ వర్తిస్తుందని తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పారిశ్రామిక వేత్తలు వ్యాపారులు మొండిబకాయి దారులు ఇప్పటికే అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికీ పన్ను చెల్లించకుండా పెండింగ్ ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు అందని వేతనాలు

- ఐదు నెలలుగా బకాయి..
- పండగ పూట పస్తులు ఉండాల్సిందేనా..?
- ఆశ వర్కర్లుగా గుర్తించాలని సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చాలీ చాలని వేతనాలతో జీవితాలు నెట్టుకొస్తున్న స్కీమ్ వర్కర్ల బాధలు వర్ణనతీతం.. రేయనక.. పగలనక ఇళ్లను కూడా వదులుకొని అహర్నిశలు కష్టపడి పని చేస్తున్న వీరికి ఐటిడిఎ అధికారులు మొండి చేయి చూపిస్తున్నారు.. చేసేది పని ఎక్కువ.. వేతనం తక్కువ... పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని చట్టాలు ఉన్నా వాటిని పాలకులు అమలు చేయక పోవడంతో శ్రమజీవుల జీవితాలు మారడం లేదు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. గిరిజనుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అ ప్రాంతాల్లో తిరుగుతూ వారి ఆలనా పాలనా చూసేందుకు ఆశా వర్కర్ల తరహాలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ప్రభుత్వం నియమించింది.. వీరి జీతభత్యాల బాధ్యతను ఐటిడిఎ పరిధిలోకి తెచ్చి పిఒకు అప్పగించారు. అయితే ఐదు నెలల నుండి వీరికి జీతాలు లేక పస్తులుంటున్నారు. ఇప్పటి వరకు వీరికి ఐటిడిఎ పిఒ జీతాలు చెల్లించకపోవడంతో ఉగాదికి పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు గత ఐదు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో పెద్ద పండుగలు మహా శివరాత్రి, ఉగాది వచ్చినా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నంద్యాల ఐటిడిఎ పరిధిలోని చెంచు గూడెంలల్లో నెలకొంది.. జీతాలు ఇవ్వమని ఐటీడీఏ అధికారులకు విన్నమించుకున్నా విడుదల చేయడం లేదని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల పట్ల వివక్ష

గిరిజన ప్రాంతాల్లో గర్భవతులకు బాలింతలకు చిన్న పిల్లలకు సేవలు చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల పట్ల ఐటిడిఎ అధికారులు నిర్లక్ష్యంతో పాటు వివక్ష చూపిస్తున్నారు. ఆశా వర్కర్లతో సమానంగా పని చేస్తున్న సిహెచ్‌డబ్యూలను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందనే అభిప్రాయన్ని వ్యక్తం చేస్తున్నారు. ఐటిడిఎ పిఒ కొంత సమయాన్ని గిరిజనుల సమస్యలపై కేటాయించి పరిష్కరించాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు వేడుకొంటున్నారు. ఆశ వర్కర్లుగా గుర్తించి రూ. 10 వేలు వేతనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, యూనిఫామ్, మెడికల్ కిట్లు, సెల్ ఫోన్లు ఇవ్వాలని కోరుతున్నారు.

సిహెచ్‌డబ్ల్యులను ఆశ వర్కర్లుగా గుర్తించాలి

- వి.యేసురత్నం, సిఐటియు జిల్లా అధ్యక్షులు.



గిరిజన ప్రాంతాల్లో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా పని చేస్తున్న వీరిని ఆశ వర్కర్లుగా గుర్తించాలి. నెలలకు పదివేల రూపాయల వేతనం ఇవ్వాలి. ఆత్మకూరు ఐటిడిఎ పరిధిలో గల వర్కర్లకు నాలుగు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి..

యూనిఫామ్, మెడికల్ కిట్లు ఇవ్వాలి

- రమణకుమారి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి.



సిహెచ్‌డ బ్ల్యూలకు యూనిఫామ్, మెడికల్ కిట్లు, సెల్ ఫోన్లు ఇవ్వాలి. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న వారికి బడ్జెట్ ఉన్నా నెల నెలా వేతనాలు ఇవ్వకపో వడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఐటీడీఏ పీవో వెంటనే కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు వేతనాలు ఇవ్వాలి. ఇతర సమస్యలు పరిష్కరించాలి.



వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

అనుభవ పేద రైతులకు పట్టాలివ్వాలి

- రైతు సంఘం

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలంలోని పిన్నాపురం గ్రామంలో అనుభవంలో ఉన్న పేద రైతులకు పట్టాలు మంజూరు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్‌కు వినతి పత్రం సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ పుణ్యామా అని పట్టాలు లేని అనుభవంలో వున్న చిన్న, సన్న కారు రైతులు ప్రభుత్వ పరిహారం అందక ఒకవైపు, కూలీ పనులు లేక ఇంకోవైపు దీనస్థితిలో జీవితం గడుపుతున్నారని అన్నారు. పట్టాలు లేని తాతల కాలం నుండి అనుభవంలో వున్న పంట పొలాలకు పట్టాలు పంపిణీ చేయాలని స్థానిక నాయకులకు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇకనైనా స్పందించకపోతే పెద్దఎత్తున గ్రామస్తులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుబ్బారాయుడు, సురేష్, ప్రసాద్, సిఐటియు మండల కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.



వైకాపాలో చేరిన నాయకులు

వైసిపితోనే అభివృద్ధి, సంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వైసిపితోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆళ్లగడ్డ శాసనసభ్యులు, వైసిపి అభ్యర్థి గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం సిరివెళ్లకు చెందిన పలువురు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. సిరివెళ్ల మండల నాయకులు, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బసాపురం అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో సిరివెళ్ల గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పురుగుల జోజి, పుట్టుపల్లె ప్రదీప్, పుట్టు పల్లె ప్రశాంత్, పుట్టుపల్లె బాలయ్య, కొల్లి సురేష్, పుట్టుపల్లె జోసెఫ్ తో పాటు 20 కుటుంబాలు టీడీపీనీ వీడి వైసిపిలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల వారికి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సిరివెళ్ల వైసిపి నాయకులు లక్కాకుల చంద్ర పాల్గొన్నారు.

15 కుటుంబాలు వైసిపిలో చేరిక



వైసీపీలో చేరుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వైసిపిలో చేరారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన వైసిపి నాయకులు నరహరి ఆధ్వర్యంలో టిడిపికి చెందిన సుభాన్, జాఫర్, సత్యం, వలి, సైకిల్ బాష, కిరణ్, హుస్సేన్ వలి, పాంషావలి, అలీ హుస్సేన్, చిన్న హుస్సేన్ వలి, అలీ ఖాన్, అలీ ఖాసీం, రాము తదితరులు 15 కుటుంబాలు వైసీపీలో చేరారు. వీరికి వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు.

అన్ని వర్గాలపై వైసిపి భారాలు : టిడిపి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అన్ని వర్గాల ప్రజలపై వైసిపి ప్రభుత్వం మోయలేని భారాలు వేసిందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి.ఫిరోజ్ విమర్శించారు. సోమవారం స్థానిక 15వ వార్డు టిడిపి నాయకులు కందాల వేణుగోపాల్, ఎబినేజర్, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. మే 13న జరిగే ఎలక్షన్లలో టిడిపికి ఓట్లు వేసి గిరినాథ్ సెంటర్ నందు మెజారిటీ తీసుకురావాలని కోరారు. నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్‌కి ఒక ఓటు, నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరికి రెండో ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నరసింహ, సంపత్, రవి, సుధాకర్, ఆరువేటి రవి, జనసేన నాయకులు పబ్బతి రవికుమార్, సందీప్ నగేష్, షబ్బీర్ గబ్బర్ సింగ్, సాయి జయంత్, సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎన్ ఎమ్ డి ఫిరోజ్

జిల్లా ప్రజలకు క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : క్రోధినామ సంవత్సర ఉగాది పండగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలందరికీ క్రోధినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.



విందు వడ్డిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని కాజువాడ మసీదులో ముస్లిం సోదరులకు పట్టణ మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి ఇఫ్తార్ విందును ఇచ్చారు. సోమవారం పట్టణంలోని ఖాజీవాడ మసీదులో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి ఇఫ్తార్ విందును ఇచ్చారు. మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొని ముస్లిం సోదరులకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసిం బాబు, టిడిపి నాయకులు అత్తార్ అను, అల్తాఫ్ హుస్సేన్, షేక్షావలి, ముస్లిం మైనార్టీ నాయకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు టిడిపి పెట్టింది పేరు

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

సంక్షేమ పథకాలకు టిడిపి పెట్టింది పేరు అని మాజీ ఎమ్మెల్యే, టిడిపి అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని టిడిపికి సంపద సృష్టించడం తెలుసని, పెరిగిన ఆదాయాన్ని ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయడానికి పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ. 3000 నిరుద్యోగ భృతి అందిస్తామన్నారు. యువతకు మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని తెలిపారు. స్కూల్‌కి వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 15,000, ప్రతి రైతుకు ఏటా రూ. 20,000 ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ. 1,500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వృద్ధులు, వితంతువులకు నెల నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే రూ.4 వేల పింఛను అందిస్తామని తెలిపారు. పెంచిన పింఛన్లను ఏప్రిల్ నుంచి పరిశీలించి జూన్‌లో పెంచిన పింఛన్లను అందజేస్తామన్నారు. రక్షిత మంచినీటి పథకం కింద ప్రతి ఇంటికి తాగునీరుని అందిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చీప్ లిక్కర్‌ను నిషేధిస్తానన్నారు. జగన్ మోహన్ రెడ్డి చీప్ లిక్కర్ వల్ల ప్రజల ఆరోగ్యం పాడై అనేక మంది ఆసుపత్రి పాలయ్యారని తెలిపారు. మొదటి 100 రోజుల్లో గంజాయి, జె బ్రాండ్ మద్యాన్ని నిషేధిస్తామని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

సాధారణ ప్రజలకు రక్షణ లేదు : టంగుటూరి శీనయ్య

ప్రజాశక్తి - బనగానపల్లె

రాష్ట్రంలో సాధారణ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య విమర్శించారు. సోమవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో టిడిపి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ అర్బన్ ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో డూండీ రాకేష్‌పై వెల్లంపల్లి శ్రీనివాస్ అనుచరులు దాడి చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో సాధారణ ప్రజలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు ఈ నెల 7వ తేదీన డూండీ రాకేష్‌పై దాడి చేసి పోలీసుల చేత మాచవరం పోలీస్ స్టేషన్‌కి తరలించడం బాధాకరమైన విషయమన్నారు. డూండీ రాకేష్ పై దాడి చేసిన వారిని, వెల్లంపల్లి శ్రీనివాస్ వర్గంపై ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పార్టీ ఆదేశాల మేరకు నిరసనలు ర్యాలీ చేపట్టాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ పకీరారెడ్డి, టిడిపి నాయకులు పరమేశ్వర రెడ్డి, సీనియర్ న్యాయవాది నాగేంద్ర రెడ్డి, ఖాదర్, ఆర్సీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ముస్లిం సోదరులకు లాయర్ అల్లి హుస్సేన్

ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - సంజామల : సంజామల మండల కేంద్రంలోని మసీదులో ముస్లిం సోదరులకు లాయర్ అల్లి హుస్సేన్ సోమవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ముస్లింలందరూ భక్తి భావంతో కలిసి మెలిసి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు యూసుఫ్ సీన్, ముద్దుబయ్య గారి మక్బూల్ హుస్సేన్, వాహబ్ హుస్సేన్, హుస్సేనా్న, మిఠాయిగిరి ముస్లింలందరూ పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న లాయర్ అల్లి హుస్సేన్

అభివృద్ధికి ఓటేయండి

- టిడిపి అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

రాష్ట్ర అభివృద్ధి కోసం టిడిపికి ఓటేయాలని టిడిపి మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని అగసనూరు గ్రామంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనతో పాటు ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజును గెలిపించాలని కోరారు. టిడిపి, జనసేన, బిజెపి అధికారంలోకి రాగానే మొదటి నెలలోనే రూ.4 వేల పింఛన్ ఇస్తామని తెలిపారు. టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షులు ముత్తరెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, ఎన్.రామకృష్ణారెడ్డి, తోవి రామకృష్ణ, మండల కన్వీనర్ జ్ఞానేశ్, టౌన్ ప్రెసిడెంట్ నర్సారెడ్డి, అరివిలి వీరేష్, రాకేష్ రెడ్డి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

కౌతాళం : మండలంలోని ఉపరహాలు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు చూడి ఉలిగయ్య ఆధ్వర్యంలో దాదాపు 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గోతులదొడ్డి గ్రామంలో టిడిపి కండువాను వేసుకొని పార్టీలో చేరారు. చూడి ఉలిగయ్య, సురేష్ నాయుడు సేవ, కార్యకర్తలకు ఇచ్చే స్ఫూర్తి, మంచితనం, గ్రామ సమస్యలపై పోరాడేతత్వం నచ్చి వైసిపి నుంచి టిడిపిలో చేరినట్లు వారు పేర్కొన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందడం లేదని, గ్రామాల్లో సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని తెలిపారు. అందుకే వైసిపిని వీడుతున్నట్లు టిడిపి గ్రామ నాయకులు ఈరన్న సహకారంతో టిడిపి కండువా కప్పుకున్నట్లు తెలిపారు. అనంత రెడ్డి, లింగన్న, గణేష్, బిజె.వీరేష్, మహాదేవ, భీమా, వీరేష్, ఈశ్వర్, గాదిలింగ, ఈరన్న, రామకృష్ణ, శివ, పీటర్ మహాదేవ, బడ్డిగా ఈరన్న, కోసిగి శివరాజ్, చాకలి హరీష్, నాగరాజు, దస్తగిరి పార్టీలో చేరారు.



అగసనూరులో ప్రచారంలో పాల్గొన్న రాఘవేంద్ర రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాఘవేంద్రరెడ్డి

రైలుకు ఎదురెళ్లి ప్రేమ జంట ఆత్మహత్య

- తుంగభద్ర రైల్వే ట్రాక్‌పై పడిన మృతదేహాలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రేమలో పడిన యువతి, యువకులు ఇరు కుటుంబాల పెద్దలు ప్రేమ పెళ్లికి అంగీకరించరేమో అన్న అనుమానంతో ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం మండలంలోని తుంగభద్ర రైల్వే స్టేషన్‌లో వస్తున్న రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. మంత్రాలయం గ్రామానికి చెందిన బోయ అంజి కుమార్తె ఎం.నందిని (19) బిటెక్ చదువుతున్నారు. మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన చాకలి గోవిందు కుమారుడు చాకలి వెంకటేష్ (20) ఇంటర్ వరకు చదువుకున్నారు. ఇద్దరు గత కొంతకాలంగా ప్రేమించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై బయల్దేరిన వారు రాయచూర్ వైపు నుంచి వస్తున్న రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



నందిని



వెంకటేష్

తహశీల్దార్ ఈరమ్మ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఆస్పరి

ఎండలు రోజురోజుకు విపరీతంగా పెరగడంతో కార్యాలయాలకు వచ్చే రైతులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు తహశీల్దార్ ఈరమ్మ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ ఈరమ్మ చేతులమీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆస్పరి, ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు, మహిళలు, విద్యార్థులు వివిధ పనులపై నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తూ వెళ్తుంటారని తెలిపారు. వారి దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే ఆయా గ్రామాల్లోని సచివాలయాల దగ్గర సర్పంచులు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ భీమేష్, సీనియర్ అసిస్టెంట్ రంగస్వామి, జూనియర్ అసిస్టెంట్లు నబి రసూల్, ప్రశాంతి, విఆర్ఒ హరి నాయక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్ ఈరమ్మ

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-ఆలూరు

హాలహర్వి మండలం చింతకుంట గ్రామం ఊరి బయట చెట్ల కింద పేకాట ఆడుతున్న 9 మంది నిందితులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.లక్ష నగదు, 6 బైక్‌లు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లోని వ్యక్తులను అరెస్టు చేసినట్లు చెప్పారు. దాడుల్లో హాలహర్వి ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది విజయ్, అయ్యస్వామి, రంగ నాయక్ పాల్గొన్నారు.



నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

డిగ్రీ ఫలితాల్లో రావూస్ జయభేరి

- టౌన్ టాపర్లుగా విద్యార్థులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాయలసీమ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 3వ, 5వ సెమిస్టర్ల ఫలితాల్లో పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జయభేరి మోగించారు. ఎమ్మిగనూరు టౌన్ టాపర్లుగా నిలిచి రావూస్ విద్యార్థులు ప్రతిభ చాటారు. బీఎస్సీ (ఎంఎస్‌సిఎస్) 5వ సెమిస్టర్‌లో ఎస్.తబసుమ్ 9.54, ఎన్.శ్రావణి 9.38, బీజడ్‌సీలో సంధ్యారాణి 9.40, ఎస్.అర్ఫాభాన్ 9.38, ఎంపిసిఎస్‌లో కె.వీణ 9.04, సి.ఇందు 9, బికామ్‌లో ఎం.ఈరమ్మ 8.32, బి.కావేరి 8.21, బిఎలో సి.రాఘవేంద్ర 8.33, ఎం.నాగబాబు 8.22, బిబిఎలో బి.వీరేష్ 8.52, వి.సుదర్శన్ 8.04 జిపిఎలతో టౌన్ టాపర్లుగా, గ్రూప్ టాపర్లుగా నిలిచారు. అలాగే 3వ సెమిస్టర్ ఎంపిసిఎస్‌లో టి.దివ్య 8.63, బి. ఇందు 8.06, ఎంఎస్‌సిఎస్‌లో ఎ.అర్షిత 8.84, కె.దివ్య శ్రావణి 8.74, బీజడ్‌సీలో విక్టోరియా నిస్సి 8.64, ఎస్.తస్లీమా 8.52, బికామ్‌లో కె.సహిదా 8.09, బి.తేజ 7.96, బిబిఎలో కె.మేఘన 7.05, ఎం.యుగంధర్ 6.02, బిఎలో కె.చంద్రిక 7.22, ఈ.పవిత్ర 7.09 జిపిఎలతో గ్రూప్ టాపర్లుగా నిలిచారు. వివిధ గ్రూపులవారీగా 5వ సెమిస్టర్ ఫలితాల్లో ఎంఎస్‌సిఎస్‌లో 67.64 శాతం, ఎంపిసిఎస్‌లో 55.06 శాతం, బీజడ్‌సీలో 81 శాతం, బికామ్‌లో 56శాతం, బిఎలో 93 శాతం, బిబిఎలో 57 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే 3వ సెమిస్టర్ ఎంఎస్‌సిఎస్‌లో వంద శాతం, ఎంపిసిఎస్‌లో 76 శాతం, బీజడ్‌సీలో 72.3 శాతం, బికామ్‌లో 68 శాతం, బిఎలో 48 శాతం, బిబిఎలో 67శాతం ఉత్తీర్ణత సాధించారు. డిగ్రీ 3వ, 5వ సెమిస్టర్‌లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనారెడ్డి, ప్రిన్సిపల్ ఇర్ఫాన్, నోడల్ ఆఫీసర్ మనోహర్, అధ్యాపకులు వెంకటేష్, నూర్ బాషా, పవిత్ర, నందిని, జయలక్ష్మి, అన్నపూర్ణ, విజయ్ కుమార్, నరసింహులు, రామకృష్ణ, విజయరాజు, గోరంట్ల, పాలరాజ్, వీరేష్, మనోహర్, ధనుంజయ, గోవిందులు సోమవారం అభినందించారు.



టాపర్ విద్యార్థులతో రావూస్ యాజమాన్యం, అధ్యాపకులు



రాజీనామా చేస్తున్న వాలంటీర్లు

జగన్‌ను సిఎం చేయడమే ధ్యేయం

- వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - ఆస్పరి

జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయడమే తమ ధ్యేయమని గ్రామ వాలంటీర్లు గఫూర్, రాజు, రాకేష్ తెలిపారు. సోమవారం మండలంలోని దాదాపు 200 మంది గ్రామ వాలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపిడిఒ లక్ష్మీ నారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. గ్రామ వాలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్, సిమ్ము, డేటాను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలని సూచించారు. ఒకవేళ సెల్‌ఫోన్ పోయినట్లయితే పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కాపీ లేదా అఫిడవిట్ ఇవ్వాలని పేర్కొన్నారు. లేకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చలివేంద్రాలు ఏర్పాటు



ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మేజర్ పంచాయతీలో నాలుగు ప్రాంతాల్లో బైరి వెంకటమ్మ, బైరి చిన్న పుల్లన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం చలివేంద్రాలను గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బైరి వెంకటమ్మ బైరి చిన్న పుల్లన్న మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు బైరి శ్రీహరి, బైరి బ్రహ్మం మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి తమ తల్లిదండ్రుల పేరు మీద మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రుద్రవరంలోని పెద్దమ్మబైలు, అమ్మవారి శాల సెంటర్, సంత మార్కెట్, జడ్పీహెచ్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చల్లటి తాగునీటిని (కూల్ వాటర్) ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొల్లం పుల్లయ్య, టిపి నరసింహారావు(బాబు), దేవగుడి రహిమాన్, నూకల కృష్ణమూర్తి, లింగం బ్రహ్మయ్య శెట్టి, డేగల చెన్నయ్య, మందలూరు శ్రీనివాసరెడ్డి, మబ్బు బాలస్వామి, సీమోను, లోడుగు నరసింహులు, లాజర్, సామేలు, రాజేష్, వడ్డే చంటన్న శౌరి, తువ్వపల్లి బాష తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసు నిందితులు అరెస్టు

- చోరీ సొత్తు రికవరీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల మండలం రైతునగరం గ్రామం, భగత్ సింగ్ కాలనీలో గత నెల మార్చిలో జరిగిన హౌస్ బ్రేకింగ్ దొంగతనం కేసును నంద్యాల తాలూకా పోలీసులు ఛేదించారు. సోమవారం నంద్యాల డీఎస్పీ రవింద్రనాథ్ రెడ్డి విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల ఆటోనగర్ సమీపంలో గల పోలూరు క్రాస్ రోడ్డు వద్ద హైదరాబాద్‌కు చెందిన సుధాకర్, తిరుపతికి చెందిన గణేశ్ బ్రహ్మదేవిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 20 లీటర్ల సారా, 7 తులాల బంగారు కంకణములు, 4 జతల బంగారు కమ్మలు, సాదా బంగారు గొలుసు, 4 చేతి వుంగారాలు, బంగారు చంప చారలు, బంగారు నల్లపూసల దండ, చిన్న బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో తాలూకా సిఐ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద లావాదేవీల వివరాల పంపాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

లక్షకు పైగా జరిగిన లావాదేవీలు, అనుమానాస్పద లావాదేవీల రోజువారీ వివరాలను పంపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత బ్యాంక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సాధారణ ఎన్నికల 2024కు సంబంధించిన వ్యయపర్యవేక్షణ (ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్)పై బ్యాంకర్లతో, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్, ఆర్‌బిఐ నుండి జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం లావాదేవీల వివరాలను 9 బ్యాంకులు మాత్రమే ప్రతిరోజు నివేదికలు పంపిస్తున్నాయని, మిగిలిన బ్యాంకులు ఇంతవరకు నివేదికలను పంపలేదని కలెక్టర్ పేర్కొన్నారు. వివరాలు పంపకపోతే ఎలక్షన్ కమిషన్, ఆర్‌బిఐ నుండి జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘిస్తున్నారని భావించాల్సి వస్తుందని తెలిపారు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులకు పలు మార్లు చెప్పినప్పటికీ కూడా ఇంతవరకు నివేదిక కూడా పంపలేదని, ఎల్‌డిఎం తీసుకువచ్చారు..బ్యాంకుల నుండి నివేదికలు రాకపోతే సంబంధిత బ్యాంకులకు నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారి మీద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.. సంబంధిత బ్యాంకుల కంట్రోలింగ్ ఆఫీసర్స్ కచ్చితంగా హాజరు కావాలని కలెక్టర్ ఈ సందర్భంగా బ్యాంకర్లను ఆదేశించారు. గత 15 నుండి 20 రోజుల్లో రూ.లక్షకు పైగా ట్రాన్సాక్షన్ జరగడం, గత కొన్ని నెలల నుండి డీ యాక్టివ్‌లో ఉన్న అకౌంట్ సడన్ గా యాక్టివ్ కావడం, సడెన్‌గా ఒక అకౌంట్ నుండి పదేపదే ట్రాన్సాక్షన్లు జరగడం వంటి వాటిపై దృష్టి పెట్టాలని కలెక్టర్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఇలాంటి వాటి వివరాలను కూడా పంపాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎల్‌డిఎం రామచంద్ర రావు, డిసిఒ రామాంజనేయులు, డిఆర్‌డిఎ పిడి సలీంబాష, మెప్మా పిడి శివనాగలీల, ఇన్కమ్ ట్యాక్స్ నోడల్ అధికారి పాండురంగ, బ్యాంకర్స్, తదితరులు పాల్గొన్నారు..


అధికారులతో మాట్లాడుతున్న కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అలివేలమ్మ

ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాం సమీక్ష

ప్రజాశక్తి మద్దికేర

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నీతి అయోగ్‌లో భాగంగా ఆస్పిరేషన్ ప్రోగ్రాం, నిర్వహించినట్లు ఎంపిడిఒ అలివేలమ్మ తెలిపారు. మద్దికేర ఎంపిడిఒ కార్యాలయంలో 10 శాఖల మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఆస్పరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో ఎడ్యుకేషన్, హౌసింగ్, ఉపాధిహామీ, ఐకెపి, అగ్రికల్చర్, వెటర్నరీ, ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యూఎస్, వంటి 10 ప్రభుత్వ శాఖలు ఉన్నాయన్నారు. ఈ 10 శాఖల ద్వారా ప్రతి నెలకు సమీక్ష సమావేశం నిర్వహించి నివేదికను కేంద్రానికి అందించాలన్నారు. 10 శాఖలకు సంబంధించిన ప్రభుత్వ అధికారులు మండలంలో ప్రజలకు ఉపయోగపడేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అఖిల, ఎంఇఒ రంగస్వామి వెటర్నరీ, ఆఫీసర్ కృష్ణ నాయక్, పంచాయతీరాజ్ ఎఇ విష్ణు అగ్రికల్చర్ ఎఒ రవికుమార్, ఆరోగ్యశాఖ మెడికల్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, ఉపాధి హామీ ఎపిఒ నర్సిరెడ్డి ఐకెపి ఎపిఎం మధుబాబు హౌసింగ్ ఎఇ ఉమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన పర్ల వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం పర్ల గ్రామంలో వైసిపి నుంచి 20 కుటుంబాలు టిడిపిలో చేరాయి. పాణ్యం నియోజకవర్గ కల్లూరు మండలం పర్ల గ్రామ వైసిపి 1వ బూత్ కన్వీనర్ బి.మల్లికార్జున, నాగార్జున, కోమటి హరి, మనోహర్‌తో పాటు 20 కుటుంబాలు టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి గౌరు వెంకట రెడ్డి సమక్షం లో సోమవారం తెలుగుదేశం పార్టీ లో చేరారు. వారికి గౌరు వెంకటరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో చేరిన వారు సురేష్, హరి, సిసింద్రీ, రాజేష్, వేణు, చిన్న ఎల్లయ్య, రాజేష్,గణేష్,రవి, ఉప్పరి గిడ్డయ్య, మహేష్ ఉన్నారు. పర్ల గ్రామం బిసి సాధికార కురువ రాష్ట్ర సభ్యులు మహానంది తదితరులు పాల్గొన్నారు.


గౌరు వెంకట్‌రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

రాతన సర్పంచి రాచప్ప 6 నెలల సెలవు

ప్రజాశక్తి తుగ్గలి



మండలం పరిధిలోనే రాతన గ్రామ పంచాయతీ సర్పంచి రాచప్ప 6 నెలలపాటు సెలవులోకి వెళ్లారు. రాతన గ్రామ పంచాయతీ సర్పంచి రాచప్ప తనకు ఆరోగ్యం సరిగా లేనందున బాధ్యతలు నిర్వహించేందుకు ఇబ్బందిగా ఉంటుందని, అందువల్ల 6 నెలల పాటు సెలవులో మంజూరు చేయాలని సోమవారం ఎంపిడిఒ విజయలక్ష్మికి సెలవు పత్రం ఇచ్చారు. దీంతో సెలవు పత్రాన్ని ఎంపిడిఒ విజయలక్ష్మి జిల్లా పంచాయతీ అధికారికి పంపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగినప్పుడు ఉప సర్పంచి అన్వర్ బాషకు రెండు సంవత్సరాలు సర్పంచి పదవి ఇవ్వాలని స్థానిక వైసిపి నాయకులు ఒప్పందం చేసినట్లు తెలుస్తుంది. ఉప సర్పంచ్‌గా ఉన్న అన్వర్ భాషకు ఇన్‌ఛార్జి సర్పంచి గా బాధ్యతలు అప్పగించేందుకే సర్పంచి రాచప్ప సెలవులో వెళ్ళినట్లు తెలుస్తుంది. పై విషయాన్ని జిల్లా అధికారులకు పంపుంపుతామని ఎంపిడిఒ తెలిపారు.

రూ.3.2 లక్షల అపహరణ

ప్రజాశక్తి- పత్తికొండ

పత్తికొండలో ఓవ్యక్తి కూతురు వివాహం కోసం బ్యాంకు నుంచి డ్రాచేసిన రూ.3లక్షల 20 వేలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. పత్తికొండ పట్టణంలోని కొత్త బస్టాండ్ కు వెళ్లే రహదారిలో స్మైల్ డెంటల్ పక్కన శ్రీ రంగనాథ ఫర్టిలైజర్స్ షాపు దగ్గర పుచ్చకాయలమాడ గ్రామానికి చెందిన బోయ కాశన్న తండ్రి బోయ రామదాసు తన చిన్న కుమార్తె వివాహం కోసం పత్తికొండ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు నుండి డబ్బును డ్రా చేశారు. రూ.మూడు లక్షల 20వేలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి టౌన్ సిఐ మురళీమోహన్ చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

'రాజ్యాంగ పరిరక్షణ'పై కవిసమ్మేళనం

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏప్రెల్ 14న రాజ్యాంగపరిరక్షణ అంశంపై కవిసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సాహితీస్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప , ఆవుల చక్రపాణి యాదవ్ తెలిపారు. కర్నూలు నగరంలోని సీక్యాంప్ సెంటర్ లోని లలితకళాసమితిలో 14న ఆదివారం సాయంత్రం 5.30 లకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కవిసమ్మేళనంలో పాల్గొనదలచిన కవులు తమ పేర్లను 9963350973 /8790257601 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు. కవిత చదివిన ప్రతివొక్కరికీ ప్రశంసాపత్రం అందిస్తామన్నారు. భారత రాజ్యాంగం పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని, నమ్మకాన్ని మరింత బలోపేతం చేసేక్రమంలో ఈ కవిసమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కవిసమ్మేళనంలో ఎవరైనా పాల్గొనవచ్చని, ఎవరైనా తమ కవితలతో అలరించవచ్చని పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా వుండేది రాజ్యాంగమేనన్నారు. కవులు, రచయితలు కళాకారులు సాహిత్యాభిమానులు , ఉపాధ్యాయులు రాజ్యాంగంపై కవితలతో రావాలని , అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.